క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 2 అర్జీలు



తెనాలిఅర్బన్: మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెండు అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వాటిలో సర్వే జరిపించాలని ఒకటి, వీధికి పేరు పెట్టాలని మరొకటి వచ్చాయని చెప్పారు. పరిశీలించి చర్యలు తీసుకోనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏసీపీ శివన్నారాయణ, పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై 20 అర్జీలు

తెనాలి: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో మొత్తం 20 అర్జీలు వచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కార్యాలయ పరిపాలన అధికారి శ్రీధర్‌బాబు అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి అత్యధికంగా 12 అర్జీలు వచ్చాయి. పోలీస్ శాఖ పరిధిలో మూడు అర్జీలు రాగా, పంచాయతీరాజ్‌కు సంబంధించి మరో మూడు అర్జీలు వచ్చాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, గృహ నిర్మాణ శాఖ పరిధిలో ఒక్కోటి చొప్పున వచ్చాయి. వీటిని సంబంధిత అధికారులకు పంపి, నిర్ణీత వ్యవధిలోగా పరిష్కారమయ్యేలా చూస్తామని ఏవో శ్రీధర్‌బాబు వెల్లడించారు.

రక్తదాతకు అభినందన

తెనాలిటౌన్: ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళకు రక్తదానం చేసిన ఏసీ మెకానిక్, పెదరావూరు గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు అద్దంకి కోటేశ్వరరావు సేవలు అభినందనీయమని ఆర్టీసీ ఉద్యోగి ఈపూరి ప్రేమ్‌కుమార్ కొనియాడారు. పెదపూడి గ్రామానికి చెందిన కుక్కమళ్ళ యేసుమణి అనే మహిళ భర్తను కోల్పోయి కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలతో జీవిస్తుంది. ఆమెకు ఇటీవల జబ్బు చేయడంతో స్థానిక గంగానమ్మ పేటలోని దివిస్ హాస్పిటల్‌లో ఆపరేషన్ చేస్తుండగా సర్జరీ నిమిత్తం రక్తం అవసరమవడంతో బీజేఆర్ కమిటీ సభ్యుల సహకారంతో అద్దంకి కోటేశ్వరరావు వెంటనే ఆమెకు రక్తదానం చేయడంతో కోటేశ్వరరావును పెదరావూరు బాప్టిస్ట్ చర్చి కమిటీ పెద్దలు అభినందించారు.

తాడేపల్లిలో వరుస చోరీలు



తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో చోరీలు జరుగుతుండడంతో చిరు వ్యాపారులు, ద్విచక్ర వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం తెల్లవారుజామున ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారి వెంబడి తాడేపల్లి సాయిబాబా గుడి వద్ద డేవిడ్ రాజు అనే చిరు వ్యాపారి దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. దుకాణం పగలకొట్టి అందులో ఉన్న కూల్‌డ్రింక్ బాటిల్స్, సిగరెట్లు, రూ.6 వేల నగదు దొంగిలించారు. ఆ చిరు వ్యాపారి సుమారు రూ.18,500 నష్టం జరిగిందని, దుకాణం మరమ్మతులకు మరో రూ.5 వేలు ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశాడు. తాడేపల్లి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న మూడు ద్విచక్ర వాహనాల హ్యాండిల్ లాక్ తొలగించి చోరీ చేశారు. ఈ నెల 18న పాత పోస్టాఫీస్ వద్ద పోయిన ద్విచక్ర వాహనాన్ని విజయవాడ మాచవరం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లిపోయారు.

రైతు సేవా కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు చేయాలి

దుగ్గిరాల: చిన్న, సన్నకారు రైతులు పండిస్తున్న పెసలు, మొక్కజొన్న పంటలను రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు కోరారు. తహసీల్దారు కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ ఐ.సునీతకు వినతి పత్రం అందజేశారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ రైతులకు గిట్టు బాటు ధర కల్పించాలన్నారు. పెసలు ధర క్వింటాకు రూ.8వేలు ఉండగా ప్రవేటు వ్యక్తులు దగ్గర వాటి ధర రూ.7వేలుగా కొనుగోలు చేయడంతో రైతులు వెయ్యి రూపాయలు నష్టం పోతున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ కొనుగోలు చేస్తామని పంట కొనుగోలు చేస్తామని ప్రకటన చేసినప్పటికీ ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలేదన్నారు. వినతిపత్రం అందించిన వారిలో బి.అమ్మిరెడ్డి, స్టాలిన్ ఉన్నారు.

తాడేపల్లి వ్యక్తికి ఉత్తమ కార్టూనిస్ట్ అవార్డు

తాడేపల్లి రూరల్ : తాడేపల్లికి చెందిన ఐ. నాగేశ్వరరావుకు ఉత్తమ కార్టూనిస్ట్ అవార్డు అందుకున్నారు. విశాఖపట్నంకు చెందిన ఉత్తరాంధ్ర కోస్తా కార్టూనిస్టుల ఫోరం, హాస్యానందం సౌజన్యంతో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది (2025) సంవత్సరానికి గాను ఐ.నాగేశ్వరరావు వేసిన కార్టూన్‌ను ఎంపిక చేశారు. ఆ అవార్డును నాగేశ్వరరావు విజయవాడ కేబీఎన్ కళాశాలలో విశాఖపట్నంకు చెందిన నార్త్ కోస్ట్ ఫోరం, హాస్యానందం సంపాదకులు రాము, రామశర్మ, టి.ఆర్.బాబు, ఎస్.లక్ష్మణరావుల సమక్షంలో అందుకున్నారు. ఐ.నాగేశ్వరరావుకు ఉత్తమ కార్టూన్ అవార్డు రావడంతో తాడేపల్లి వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైఖానస ఆగమ పండితుడు దీవి లక్ష్మీనరసింహాచార్యులు

నేడు తిరుపతిలో 'ఆగమ ద్యుమణి' బిరుదు ప్రదానం

తెనాలి: పట్టణంలోని రామలింగేశ్వరపేటకు చెందిన ప్రముఖ వైఖానస ఆగమ పండితుడు, ఆధ్యాత్మిక ప్రవచనకర్త దీవి లక్ష్మీనరసింహాచార్యులకు తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం 'ఆగమ ద్యుమణి' బిరుదు ప్రదానం చేసి సత్కరించనుంది. విద్యాపీఠంలో మంగళవారం జరగనున్న వార్షికోత్సంలో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహాచార్యులు పరిచయం.

స్వగ్రామం.. కొలకలూరు

లక్ష్మీనరసింహాచార్యులు స్వస్థలం తెనాలి రూరల్ మండల గ్రామం కొలకలూరు. ప్రాథమిక విద్య నుంచి ఎస్ఎస్ఎల్‌సీ వరకు స్వగ్రామంలో చదివారు. మెదక్ జిల్లా సిద్దిపేటలో పీయూసీ, బీఏ పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ చేశారు. మరోవైపు తన సోదరుడు హనుమంతాచార్యులు వద్ద వైఖానస ఆగమ విద్య అభ్యసించారు. మెదక్ జిల్లాలోనే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా వృత్తి జీవితం ప్రారంభించారు. కొంతకాలం తర్వాత తెనాలి తిరిగివచ్చి స్థానిక వీఎస్సార్ కాలేజీలో తెలుగు అధ్యాపకునిగా చేరారు. ఆయన పాండిత్య గరిమను గుర్తించిన అమెరికాలోని తెలుగువారు 1991లో ఆహ్వానించారు. అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలోని శాన్‌ఆంటోనియాలో నిర్మితమైన వేంకటేశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్ ఆయనను ప్రధాన అర్చకునిగా నియమించింది. 2005 వరకు అక్కడ తన సేవలను అందించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, దేవదాయ ధర్మదాయ శాఖ నిర్వహించే ఆగమ పరీక్షల అధికారిగా కొనసాగారు.

విద్యార్థులను తీర్చిదిద్దారు

వైఖానస ఆగమంలో ప్రతిష్ఠాంతం వరకు దేశ విదేశాలలో వ్యవహరించారు. అమెరికాలోని టెక్సాస్, బరసానధామ్, చికాగో, లివర్‌మోర్, డల్లాస్, సెయింట్ లూయిస్ ఆలయాల్లో ప్రతిష్ఠలు కుంభాభిషేకాలు, కల్యాణోత్సవాలు... వంటి దైవిక కార్యక్రమాలను నిర్వహించారు. అమెరికా ఆకాశవాణిలో తెలుగు, ఇంగ్లీషు, హిందీ, సంస్కృతం, కన్నడ భాషల్లో ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక ప్రాంతాల్లో భాగవత సప్తాహాలు, సుందరకాండ పారాయణ, ఇతిహాసాల ప్రచారం నిర్వహణతో పాటు, వైఖానస ఆగమ శాస్త్రంలో పలువురు విద్యార్థులను తీర్చిదిద్దారు.

గౌరవాలు, సత్కారాలు



దీవి లక్ష్మీనరసింహాచార్యులు

తన ఆధ్యాత్మిక సేవలకుగాను లక్ష్మీనరసింహాచార్యులు అనేక గౌరవాలను అందుకున్నారు.

- 1995లో అమెరికాలో అక్కడి ధార్మిక సంస్థలు 'ఆగమ బ్రహ్మ' బిరుదును ప్రదానం చేశాయి.
- రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ ఉగాది పురస్కారంతో సత్కరించింది. తెనాలి పట్టణంలోని వైఖానస సేవా సంఘానికి గౌరవ అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ తన వంతు సేవ చేస్తున్నారు.
- వైఖానస యూత్ ఫోరం, వైఖానస సంక్షేమ సంఘం, వైఖానస మహామండలి, హైదరాబాదులోని వేద్ కాన్ సంఘాలతో పాటు ఆర్యవైశ్య సంఘం, రంగనాథాచార్య స్మారక ట్రస్ట్, నారాయణ శ్రీనివాసాచార్య స్మారక ట్రస్ట్, సత్యసాయి సేవా సంఘం, గణేష్ ఉత్సవ కమిటీలు, ఆంజనేయ భక్త సమాజం, మెదక్ జిల్లాలోని జరా సంగం శివాలయం ట్రస్ట్, విద్యా కమిటీ, కొలకలూరు వంటి అనేక ధార్మిక, సేవా సంఘాలు ఆయనను సత్కరించాయి.
- అధ్యాపక వృత్తి నుంచి రిటైరయ్యాక, ఆయన కుమారుడు దీవి రాంబాబు పేరిట స్మారక ట్రస్ట్ ఏర్పాటు చేసి ఆగమ పండితులు, ఆగమ, పేద విద్యార్థులు, పలు సంఘాలకు ఆర్థిక చేయూతను అందిస్తున్నారు. ఇప్పటికీ ఆగమ విద్యార్థులకు బోధిస్తున్నారు. తెనాలి, కొలకలూరు, జంపని గ్రామాలలో దైవిక కల్యాణ మండపాలు, ఆలయాలు, అపర కర్మశాల నిర్మాణాలకు ఆర్థికంగా సహకరించారు.

తెనాలిని మహానగరంగా తీర్చిదిద్దుతాం

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



పారిశుద్ధ్య సిబ్బందికి ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న మంత్రి మనోహర్

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణాన్ని మహానగరంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో నూతనంగా కొనుగోలు చేసిన రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీ, మూడు కాంపాక్టర్లను సోమవారం శివాజీచౌక్‌లో ఆయన ప్రారంభించారు. ముందుగా శివాజీచౌక్‌లోని యడ్లపాటి వెంకట్రావు ద్వారాన్ని పునఃనిర్మించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ చాలెంజింగ్ కాంపిటీషన్‌లో గెలుపొందిన పారిశుద్ధ్య ఉద్యోగులకు మెమెంటో, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించడం తెనాలిలో మొట్టమొదట ప్రారంభమైందని గుర్తు చేశారు. తెనాలిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులకు ప్రజలందరూ సహకరించడం అభినందనీయమన్నారు. సుందరీకరణలో భాగంగా శివాజీచౌక్‌లో రూ.1.30 కోట్లతో రోడ్డును విస్తరిస్తున్నట్లు, రూ.2.60 కోట్లతో కొత్త పారిశుద్ధ్య వాహనాలను కొనుగోలు చేయడం జరిగిందన్నారు. త్వరలో నారాకోడూరు–తెనాలి, తెనాలి–మంగళగిరి నాలుగు లైన్ల రహదారి పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. స్వచ్ఛాంధ్ర పోటీలను నిర్వహించిన అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిక్ జగన్నాథ్, యడ్లపాటి వెంకట్రావు మనవడు యడ్లపాటి తేజను ఆయన అభినందించారు. తెనాలి త్వరలో కార్పొరేషన్‌గా మారనున్నదని ఫస్ట్ కమిషనర్‌గా పవర్ స్వప్నిక్ జగన్నాథ్‌ను తీసుకురానున్నట్లు ప్రకటించారు. తెనాలిలో శిక్షణ పొందడం ఎంతో సంతోషాన్నిచ్చిందని అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిక్ జగన్నాథ్ పేర్కొన్నారు. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, వాటిని అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, కమిషనర్ బండి శేషన్న, కౌన్సిలర్లు సయ్యద్ ఖలేదా నసీమ్, కొత్రపాటి లక్ష్మి, కొమ్మురబత్తుని జయపాల్, గోగిరెడ్డి మానసరెడ్డి, గుంటూరు కోటేశ్వరరావు, పేరం సంజీవరెడ్డి, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, అన్నం పిన్నారావు, గొడవర్తి శ్రీసాయిహరేరామ్, అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, ఏసీపీ శివన్నారాయణ, ఇన్‌చార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, ఆర్‌వో రాంప్రసాద్, ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, డీఎస్పీ జనార్దనరావు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డొంక రోడ్డులో ఆక్రమణలను తొలగించండి



తహసీల్దారు జి.సిద్దార్థకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

కొల్లిపర: మండల పరిధిలోని దావులూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 503లో డొంక రోడ్డు కూడా కొంత మంది రైతులు ఆక్రమించుకుని సాగు చేయటం వలన పంట ఉత్పత్తులు బయటకు వెళ్లే సమయంలో అనేక ఇబ్బందులకు గురవుతున్నామని, రెవెన్యూ అధికారులు సదరు డొంకను సర్వే నిర్వహించి ఆక్రమణలను తొలగించాలని దావులూరి పాలెం రైతులు సోమవారం గ్రీవెన్స్‌లో తహసీల్దారు జి.సిద్ధార్థకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ దావులూరు రెవెన్యూ పరిధిలోని గంగానమ్మ గుడి, కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం నుంచి కొత్తబొమ్మువారిపాలెం ఆర్ అండ్ బీ రోడ్డు వరకు ఉన్న డొంక రోడ్డును కొంత మంది స్వార్థపరులు వారి పంట పొలంలో కలుపుకోవటం వలన దిగువన ఉన్న రైతులు పంట దిగుబడులను తరలించే సమయంలో అనేక ఇబ్బందులు పడుతుండటంతో 2024లో అప్పటి తహసీల్దారుకు వినతి పత్రం అందజేయగా ఆయన వెంటనే స్పందించి సదరు డొంకను సర్వే చేయించి హద్దుల వద్ద సర్వే రాళ్లు ఏర్పాటు చేసే సమయంలో కొంత మంది రైతులు అభ్యంతరం తెలిపి అడ్డుకున్నారు. అనంతరం ఎన్నికలు రావటంతో ఆనాటి నుంచి ఆ సమస్య అలాగే ఉంది అని రైతులు వివరించారు. దీంతో అర్జీ తీసుకున్న తహసీల్దారు సిద్ధార్థ మాట్లాడుతూ త్వరలోనే మండల సర్వేయర్, ఆర్ఐ, వీఆర్‌వోలు డొంక రోడ్డును, రికార్డులను పరిశీలించి నిజంగా ఆక్రమణకు గురై ఉంటే వాటిని తొలగించి, హద్దు రాళ్ల ఏర్పాటు చేయటం జరుగుతుందని భరోసా కల్పించారు. అర్జీ ఇచ్చిన వారిలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు కొండా కిషోర్‌రెడ్డి, సర్పంచ్ దొంతగాని రవిశ్రీనివాస్, రైతులు వాసా శివనాగమల్లేశ్వరరావు, తోట శ్రీనివాసరావు, తోట భాలేఅబ్బాయి, కోన శివనాగేశ్వరరావు, వాసా శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



తెనాలిటౌన్: పేదలకు ఆపదలో ఆపన్న హస్తంలా ముఖ్యమంత్రి సహాయనిధి వినియోగపడుతుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక బోసురోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో మంత్రి మనోహర్ నియోజకవర్గంలోని 28 కుటుంబాలకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జబ్బు పడి వైద్య ఖర్చుల నిమిత్తం ఇబ్బంది పడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక అండగా ఉపయోగపడుతుందని తెలియజేశారు. 28 కుటుంబాలకు రూ.19,23,481 చెక్కుల రూపంలో అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు అందరూ కృషి చేయండి

టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర రమాదేవి



ర్యాలీకి జెండా ఊపి ప్రారంభిస్తున్న డాక్టర్ రమాదేవి, ఆర్ఎంవో డాక్టర్ సురేష్

తెనాలిఅర్బన్: క్షయ వ్యాధి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని తెనాలి టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డీఎస్ రమాదేవి, జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణిలు పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా వైద్యశాల నుంచి ప్రారంభమైన ర్యాలీని వారు జెండా ఊపి ప్రారంభించారు. అమరావతి ప్లాట్స్ మీదుగా చెంచుపేటలోని ఉమేష్ చంద్ర విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. అక్కడ మానవహారంగా ఏర్పడి క్షయ నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం తల్లి పిల్లల వైద్యశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 1882లో క్షయ వ్యాధిని గుర్తించడం జరిగిందన్నారు. అప్పటి నుంచి అనేక మంది దీని బారిన పడి మరణించారని చెప్పారు. జిల్లా వైద్యశాలలో క్షయ పరీక్షలు ఉచితంగా చేసి నిర్ధారణ అయిన వారికి మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. అలాగే దాతల ద్వారా మంచి పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ రాధిక, ఆర్ఎంవో డాక్టర్ సురేష్, పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాంబాబు, మార్థా గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ అధినేత యనమల ఈశ్వర్, పలువురు టీబీ, మలేరియా యూనిట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మానవహారంలో నర్సింగ్ విద్యార్థులు

దావులూరులో సీపీఎం ప్రజా చైతన్య యాత్ర



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సీపీఎం బృందం

దావులూరు (కొల్లిపర): ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమంలో భాగంగా సీపీఎం బృందం ములకా శివసాంబిరెడ్డి, కోట చంద్రశేఖరరావు, జిలుగు ముక్కంటి తదితరులు సోమవారం మండలంలోని దావులూరు గ్రామంలో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో సీపీఎం బృందం ఎదుట ప్రజలు వారి సమస్యలను విన్నవించుకుని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ గుండేరు డ్రైన్ కింద సాగు చేస్తున్న పేద ఎస్సీ రైతులకు ఉచితంగా ప్రభుత్వం బోర్లు వేయించాలని విజ్ఞప్తి చేశారు. కౌలు కార్డులు పొందిన వారికి రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని, చదువుకున్న యువకులకు ప్రభుత్వమే ఉచిత కోచింగ్ సెంటర్ ద్వారా అవకాశాలు కల్పించాలని అన్నారు. గ్రామంలో బేతాళ బజారు, మసీదు బజారు, లైబ్రరీ సెంటర్ ప్రాంతాలలో సైడ్ కాలువలు లేక మురుగునీరు నిల్వ ఉండి వాసన, దోమలతో అవస్థలు పడుతున్నారని, దళిత వాడలో ఉన్న కొద్దిపాటి శ్మశాన స్థలం నిండి పోయిందని కావున శ్మశాస స్థలం మంజూరు చేయాలని ప్రజల తరఫున ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

వేసవి దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం దోహదం



చలివేంద్రం ప్రారంభోత్సవంలో డబల్ హార్స్ మేనేజర్ రవికుమార్

తెనాలిటౌన్: ప్రజల వేసవి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం సేవలు దోహదపడతాయని డబల్ హార్స్ మినపగుళ్లు మేనేజర్ రవికుమార్ పేర్కొన్నారు. రూరల్ మండలం నందివెలుగు నాలుగు లైన్ల ప్రధాన రహదారిపై సోమవారం మేము సైతం యువజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా డబల్ హార్స్ మినపగుళ్లు మేనేజర్ రవికుమార్, ఎంపీటీసీ-1 తిన్నలూరు విజయలక్ష్మి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రతి ఏటా మేము సైతం యువజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి బాటసారుల దాహార్తిని తీర్చడం అభినందనీయమని సభ్యుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ధూళిపాళ్ళ పానకలరావు, సంఘ ప్రధాన కార్యదర్శి షేక్ షకూర్ బాషా, గౌరవాధ్యక్షుడు ధూళిపాళ్ళ సుధాకర్, అధ్యక్షుడు కళ్యాణం సాంబశివరావు, ఉపాధ్యక్షుడు యర్రమోతు జగన్‌మోహన్‌రావు, సభ్యులు కళ్యాణం కళ్యాణ్‌కుమార్, కళ్యాణం నరసింహారావు, కళ్యాణం కృష్ణసాగర్, ఎస్.వెంకటనరసయ్య, విష్ణుమొలకల నాగేశ్వరరావు, యర్రమోతు సత్యనారాయణ, మాదిరాజు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మనోహర పండుగ

ఫిరంగిపురం: మండలంలోని గరుడాచలపాలెం గ్రామంలో ఆరాధన మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మనోహర పండుగ ఆదివారం రాత్రితో ముగిసింది. ఈ సందర్భంగా యాద మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు పాస్టర్ కె.నెహమ్యా వ్యాక్యోపదేశం చేశారు. ప్రతి ఒక్క మానవుడు ప్రార్థన చేయడం ద్వారా భగవంతుడి అనుగ్రహాన్ని పొందగలుగుతారని చెప్పారు. భగవంతుడి అనుగ్రహం ఉంటే పాపాల నుంచి ప్రమాదాల నుంచి రక్షింప బడతాడని తెలిపారు. అనంతరం వాక్య పరిచర్య చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల నుంచి వచ్చిన పాస్టర్లు, సంఘకాపరి కె.జాన్‌బాబు పాల్గొన్నారు.

కష్టార్జితాన్ని కార్మిక కుటుంబాలకు చెల్లించాలి



దీక్ష శిబిరంలో మద్దతు తెలియజేస్తున్న యూనియన్ నాయకులు

తాడేపల్లి రూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల కష్టార్జితాన్ని యాజమాన్యం కార్మికుల కుటుంబాలకు చెల్లించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని నాయకులు కె. ఆదినారాయణతో కలసి సందర్శించి, మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాజమాన్యాన్ని కార్మికులు భిక్ష అడగడం లేదన్నారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుభాని, కె.హగ్గయ్య, ఇమాంబి, గురవయ్య, ఆశీర్వాదం, దుర్గా భవాని, రమణ, రిబ్కా, నాగ మల్లేశ్వరి, సాంబశివరావు పాల్గొన్నారు.

భౌ.. భౌలతో బెంబేలు

- వాటి బారిన పడుతున్న ప్రజలు
- మొక్కుబడిగా శస్త్ర చికిత్సలు
- శాశ్వత పరిష్కారం చూపని అధికారులు

తెనాలిలో జఠిలం అవుతున్న వీధి కుక్కల సమస్య



పట్టణంలో సంచరిస్తున్న కుక్కలు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో వీధి కుక్కల సమస్య జఠిలం అవుతుంది. రోజురోజుకూ పెరిగిపోతున్న వీధి కుక్కలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మొన్న షరాఫ్ బజారులో... నేడు జయప్రకాష్ నగర్‌లో వీధి కుక్కలు పలువురిపై దాడి చేశాయి. ప్రతి రోజు ఇవి ప్రజలపై దాడులు చేస్తున్న మున్సిపల్ అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఏదో గుర్తు వచ్చినప్పుడు వీధి కుక్కలను పట్టుకుని శస్త్ర చికిత్సలు చేయటం మినహా శాశ్వత పరిష్కారం చూపలేకపోతున్నారు. దీంతో ప్రజలు వాటిబారిన పడి బ్రతుకు జీవుడా అంటూ ఇంజక్షన్‌లు చేయించుకోవాల్సి వస్తోంది.

- మున్సిపల్ అధికారుల లెక్కల ప్రకారం తెనాలి పట్టణంలో 1,425 వీధి కుక్కలు ఉన్నాయి. వీటి నియంత్రణ కోసం బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్ట్ యార్డులో గతంలో కుక్కల శస్త్ర చికిత్సాలయం నిర్మించి దానిలో సంతానోత్పత్తి నియంత్రణ శస్త్ర చికిత్సలు చేస్తూ వచ్చారు. ఇప్పటి వరకు అధికారుల లెక్కల ప్రకారం 900 కుక్కలకు శస్త్ర చికిత్సలు చేశారు. మిగిలిన 525 కుక్కలకు శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉంది.

కౌన్సిలర్‌లు చెప్పినా లేని ఆచరణ

తెనాలి పట్టణంలో వీధి కుక్కల సంచారం ఎక్కువగా ఉందని, అవి ప్రతి రోజు పలువురిపై దాడులు చేస్తున్నాయని మున్సిపల్ కౌన్సిలర్‌లు గతంలో జరిగిన పలు కౌన్సిల్ సమావేశాలలో ఏకరువు పెట్టారు.

- అలాగే వీధి కుక్కల విషయంలో అధికారులు చెప్పే లెక్కలతో పోల్చితే వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయనే విషయాన్ని కూడా కౌన్సిలర్‌లే నిర్ధారిస్తున్నారు. వార్డుకు వంద చొప్పున 40 వార్డులలో 4 వేలకు పైగా కుక్కలుంటే అధికారులు కేవలం 1,425 అని చెప్పటంపై కౌన్సిల్‌లో పలు మార్లు నిలదీశారు. ఆ సమయంలో అధికారులు వీటి నియంత్రణకు చర్యలు తీసుకుంటామని చెప్పటం మినహా ఆచరణలో ఆ ది. శగా అడుగులు పడటం లేదు.

రోజుకు 15 నుంచి 20 ఇంజక్షన్‌లు



కుక్క కరవడంతో గాయాలైన కాలు

పట్టణంలోని వీధి కుక్కలు పాదచారులు, వాహనదారులపై తరచూ దాడులు చేస్తున్నాయి. ఈ విషయాన్ని జిల్లా వైద్యశాలలోని గణంకాలు నిర్ధారిస్తున్నాయి. ప్రతి రోజు కుక్క కాటుకు గురై తెనాలి జిల్లా వైద్యశాలకు వచ్చి ఇంజక్షన్లు చేయించుకునే వారి సంఖ్య ఇటీవల కాలంలో ఎక్కువగా ఉంటోందని వైద్యులు తెలిపారు. జిల్లా వైద్యశాలతో పాటు పట్టణ ఆరోగ్య కేంద్రాలలో కూడా ఇంజక్షన్‌లు అందుబాటులో ఉండటంతో అక్కడ కూడా కొంత మంది చేయించుకుంటున్నారు. తెనాలి జిల్లా వైద్యశాలలో రోజుకు 15 నుంచి 20 వరకు ఇంజక్షన్‌లు చేస్తుండగా పట్టణంలోని ఆరు అర్బన్ హెల్త్ సెంటర్‌లలో వారంలో 20 ఇంజక్షన్‌లు చేస్తున్నారు. దీనిని బట్టి చూస్తే తెనాలిలో కుక్కల స్వైర విహారం ఏ స్థాయిలో ఉందో మనకు అర్థమవుతుంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం



తెనాలి పట్టణంలో వీధి కుక్కల సమస్య కొంత తీవ్రంగా ఉన్న మాట వాస్తవం. వాటి నియంత్రణకు అనేక చర్యలు తీసుకుంటున్నాం. దీనిలో భాగంగా శస్త్ర చికిత్సలు చేయిస్తు న్నాం. రానున్న రోజుల్లో పట్టణంలోని అన్ని కుక్కలకు శస్త్ర చికిత్సలు చేయించి సంతానోత్పత్తి జరగకుండా చూస్తాం. ఇలా చేయటం వల్ల కుక్కల సంఖ్య పూర్తిగా తగ్గే అవకాశం ఉంది.

– బండి శేషన్న, కమిషనర్, తెనాలి పురపాలక సంఘం

పీ-4 సర్వేపై అవగాహన కలిగి ఉండాలి

మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్



తెనాలిఅర్బన్: పీ-4 సర్వేపై అందరూ అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావులు పేర్కొన్నారు. 7వ వార్డులోని సచివాలయంలో సోమవారం వార్డు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని 40 వార్డులలో వార్డు సభలు జరుగుతున్నాయని చెప్పారు. పీ-4 సర్వే 90 శాతంపైగా పూర్తయినట్లు చెప్పారు. మిగిలిన వారు కూడా సర్వే చేయించుకోవాలన్నారు. దీని వలన రానున్న రోజుల్లో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు లభిస్తాయని చెప్పారు. సమావేశంలో పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.